నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: నేడు పోరంకి సెక్షన్‌లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈఈ ఆపరేషన్స్ పి.హరిబాబు తెలిపారు. సిద్ధార్థ ఫీడర్ మరమ్మతులు కారణంగా పోరంకిలో గురువారం ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామన్నారు. దీని కారణంగా గ్రామంలో ప్రభునగర్, బందరు రోడ్డు, పోరంకి సెంటర్, శ్రీనగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని స్థానికులు సహకరించాలని కోరారు.

నేడు పోరంకిలో కోదండరామస్వామి దివ్య విగ్రహ ప్రతిష్ఠ



పెనమలూరు: పోరంకి గ్రామంలో శ్రీకోదండ రామాలయం దివ్య విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించనున్నారు. గ్రామంలో పురాతన రామాలయంను తొలగించి నూతన రామాలయం దాతల సహాయంతో పునర్నిర్మాణం చేశారు. కాగా గురువారం ఉదయం ధ్వజస్తంభం ఏర్పాటు చేస్తారు. అనంతరం శిఖరం, ద్వారపాలకుల విగ్రహాలు, శ్రీసీతాలక్ష్మణ ఆంజనేయ సమేత కోదండ రామస్వామివార్ల దివ్య విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం ఘనంగా నిర్వహిస్తారు. నేడు ఉదయం 8 గంటల నుంచి పూజా కార్యక్రమాలు ప్రారంభిస్తారు. ఉదయం 10.17 గంటలకు స్వామివారి దివ్యవిగ్రహ ప్రతిష్ఠ చేస్తారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి భక్తులను అన్నసమారాధన కార్యక్రమం నిర్వహిస్తారు.

సర్వేపై ఎంపీడీవో సమీక్ష

అంబాపురం(విజయవాడరూరల్): మిస్సింగ్ సిటిజన్ సర్వే వేగవంతం చేయాలని ఇన్‌చార్జి ఎంపీడీవో పి.మురళీకృష్ణ తెలిపారు. విజయవాడ రూరల్ మండలం సర్వే చేయడంలో వెనుకంజలో ఉందన్నారు. ప్రతి గ్రామంలోని సచివాలయం సిబ్బంది సర్వేను నూరుశాతం పూర్తి చేయాలన్నారు. సమన్వయ లోపం కారణంగా సర్వే సక్రమంగా జరగడంలేదన్నారు. గ్రామంలో నివసిస్తున్న వారి వివరాలు కూడా జియోట్యాగ్ కాలేదన్నారు. అంబాపురం, పి.నైనవరం, పాతపాడు, నున్న గ్రామాల్లో సర్వేపై సమీక్షించారు.

దాతల సహకారం అభినందనీయం



దాతలతో రీజనల్ డెప్యూటీ డైరెక్టర్, వైద్యులు

ఉంగుటూరు: ఆయుర్వేద వైద్యశాల మౌలిక వసతుల కల్పనకు దాతలు ముందుకు రావడం అభినందనీయమని ఆయుష్మాన్ భారత్ రీజనల్ డెప్యూటీ డైరెక్టర్ డాక్టర్ కల్పన కటాక్షం అన్నారు. ఉంగుటూరు మండలం తేలప్రోలులో ఆయుర్వేద వైద్యశాల వద్ద దాత సహకారంతో నిర్మించిన మరుగుదోడ్లను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆయుర్వేద వైద్యశాల లభించే సేవలను అందరూ సద్వినియోగించుకోవాలని పేర్కొన్నారు. వైద్యశాలలో అన్ని రకాల వ్యాధులకు మెరుగైన వైద్యం అందిస్తున్నారని తెలిపారు. అనంతరం మోదుగు సూర్యనారాయణ, రాజారత్నమ్మ, సుగుణావతిల జ్ఞాపకార్థం వారి కుమారుడు భానుసుందర్ కుమార్ నిర్మించిన మూడు మరుగుదొడ్లను ప్రారంభించారు. అనంతరం దాతలను శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా దాత మాట్లాడుతూ తమ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం రోగులకు ఉపయోగపడేలా టాయిలెట్స్ నిర్మించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లాం దిబోర, డాక్టర్ టి.లక్ష్మిసౌజన్య, జయలక్ష్మి, పుష్ప, సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిర్మూలనలో విద్యార్థులదే ప్రముఖ పాత్ర



దక్షిణ కొరియా విద్యార్థులతో ప్రిన్సిపాల్ ఏకాంబరం నాయుడు

రామవరప్పాడు: పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ వస్తువులను నిర్మూలించేందుకు విద్యార్థులు ప్రముఖ పాత్ర పోషించాలని ఎస్సార్కే ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం. ఏకాంబరం నాయుడు అన్నారు. విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడులోని ఎస్సార్కే ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం ఎఎస్ఈజెడ్ అంతర్జాతీయ విశ్వవిద్యాలయ విద్యార్థి స్వచ్ఛంద సమూహము ఆధ్వర్యంలో నేర నివారణ క్యాంపైన్, జీరో ప్లాస్టిక్ 2040 సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దక్షిణ కొరియా నుంచి వచ్చిన విద్యార్థుల బృందంతో పాటుగా నగరంలోని ఎఎస్ఈజెడ్ విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏకాంబరం నాయుడు మాట్లాడుతూ ఎఎస్ఈజెడ్ ప్రపంచవ్యాప్తంగా 175 దేశాలలోని విద్యార్థులందరితో కలిసి అనేక స్వచ్ఛంద సేవా కార్యక్రమాలను నిర్వహిస్తుందని తెలిపారు. మేనేజర్ విలియం, ప్రేమ్, పీటర్, పలు విభాగాధిపతులు రాధిక, అనూష, ఎట ప్రతాప్, డాక్టర్ సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వీరభద్రుని పళ్లెం ఊరేగింపు



ఉయ్యూరు: వీరభద్రుని పళ్లెం ఊరేగింపు బుధవారం రాత్రి వైభవంగా సాగింది. శ్రీ జగదాంబ సమేత సోమేశ్వర స్వామి (శివాలయం) వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా వీరభద్రుని పళ్లెం ఊరేగింపు నిర్వహించారు. శివాలయం నుంచి దేవతామూర్తుల వేషధారణలతో, మేళతాళాలతో భక్తిపారవశ్యం నింపుతూ ఊరేగింపు సాగింది. ఈ సందర్భంగా వీరభద్రుని నృత్య ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ (నాని), నాయకులు జంపాన గుర్నాథం, వెంట్రప్రగడ వీరాంజనేయులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థుల సత్తా



ఉయ్యూరు: రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో ఉయ్యూరు ఎంకే ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. ఈ నెల 9వ తేదీన విజయవాడ మున్సిపల్ ఇండోర్ స్టేడియంలో స్టేట్ కరాటే చాంపియన్ షిప్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో వర్షిత్‌రెడ్డి, శ్రావణి పాల్గొని ప్రథమ స్థానాల్లో నిలిచి బంగారు పతకాలను సాధించారు. కోచ్ రామకృష్ణను పాఠశాల డైరెక్టర్ ఎంకే బాబు బుధవారం అభినందించారు.

కానూరులో తిరుపతమ్మ చిన్న తిరనాళ్లు

పెనమలూరు: కానూరు గ్రామంలో వేంచేసి ఉన్న గోపయ్య సమేత తిరుపతమ్మ అమ్మవారి ఆలయంలో బుధవారం పూజలు చేశారు. అమ్మవారికి భక్తులు చిన్న తిరనాళ్ల ఘనంగా చేశారు. అమ్మవారికి భక్తులు బోనాలు సమర్పించారు. అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది.

లలితాదేవికి పంచామృతాలతో అభిషేకం

గన్నవరం: స్థానిక యాదవులపేట రామాలయంలో బుధవారం శ్రీలలితాదేవి అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు జరిపారు. అనంతరం వివిధ రకాల పుష్పాలు, ఫలాలతో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులచే శ్రీలలితా సహస్రనామ పారాయణం జరిపారు. అనంతరం భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రసాద వితరణ జరిపారు.

డీజే సౌండ్‌తో వస్తే సీజ్ చేస్తాం

ఉయ్యూరు: తిరునాళ్లలో డీజే సౌండ్స్‌తో శబ్ద కాలుష్యానికి పాల్పడితే వాహనాలను సీజ్ చేస్తామని సీఐ రామారావు అన్నారు. విలేకరులతో బుధవారం ఆయన మాట్లాడుతూ తిరునాళ్లకు వచ్చే భక్తులకు ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. భక్తులకు ఆలయానికి నలు దిక్కులా వాహనాలను నిలుపుకునేలా ఏర్పాట్లు చేశామన్నారు. శిడిబండి ఉత్సవం సందర్భంగా ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామన్నారు. ఉయ్యూరు బస్టాండు ప్రాంగణం, తోట్లవల్లూరు రోడ్డులోని శ్రీనివాసా కళాశాల ప్రాంగణం, జాతీయ రహదారి సర్వీసు రోడ్డు మార్గాల్లో వాహనదారులు పార్కింగ్‌కు వినియోగించుకోవాలని సూచించారు. భక్తులకు అసౌకర్యం కలిగితే ఆలయం సమీపంలో ఉన్న ఔట్‌పోస్టును సంప్రదించాలని సూచించారు.

పండిట్ దీనదయాళ్‌కు నివాళి

కంకిపాడు: పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతి కార్యక్రమం బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం కంకిపాడు పట్టణంలో నిర్వహించారు. దీన్‌దయాల్ ఉపాధ్యాయ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు గుళ్లపూడి శ్రీనివాసరావు, కో కన్వీనర్ దివి రోహిణీకుమార్ మాట్లాడారు. నియోజకవర్గ కన్వీనర్ విజయేంద్ర, పెనమలూరు మండల అధ్యక్షుడు ఇ. శ్రీనివాస్, ప్రతినిధులు పువ్వాడ కృష్ణమోహన్, ఉపద్రష్ట మురళీ, ఐనాల విశ్వేశ్వరరావు, కంకిపాటి శివశంకర్, తదితరులు పాల్గొన్నారు.

శానిటరీ వర్కర్ల ఉద్యోగానికి దరఖాస్తు చేయండి

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీలో అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పని చేయటానికి శానిటరీ ఉద్యోగాలకు దరఖాస్తు చేయాలని కమిషనర్ భవానిప్రసాద్ తెలిపారు. ఆయన బుధవారం వివరాలు తెలుపుతూ తాడిగడప మున్సిపాలిటీలో శానిటరీ విభాగంలో పని చేయటానికి వర్కర్లు కావాలన్నారు. చెత్త కుప్పలు తొలగించటం, డ్రైనేజీలు పూడిక తీయటం, ట్రాక్టర్లు, లారీలు నడపటానికి హెవీ లైసెన్స్ ఉన్న డ్రైవర్లు దరఖాస్తు చేయాలన్నారు. చదవటం, రాయటం రావాలని, 18-25 సంవత్సరాల వయస్సు ఉండాలని అన్నారు. మరిన్ని వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

ఉపాధి పనుల పరిశీలన

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో ఉపాధి పనులను ఇన్‌చార్జి ఎంపీడీఓ పి.మురళీకృష్ణప్రసాద్ బుధవారం పరిశీలించారు. ఇంత పెద్ద గ్రామంలో 19 మంది కూలీలు రావడం వలన ఆశించిన మేర పనులు జరగడంలేదని తెలిపారు. కూలీలను పెంచి పనులు చేయించాలని ఆయన టెక్నికల్ అసిస్టెంట్‌కు సూచించారు. గ్రామంలో 22 మంది కూలీలున్నారని వారిలో ముగ్గురు పనికి రాలేదని 19 మంది మాత్రమే పనికి వచ్చినట్లు సిబ్బంది తెలిపారు. జాబ్ కార్డులు కావాలని గ్రామస్తులు కొందరు అడిగారు. అడిగిన వారందరికీ జాబ్‌కార్డులు ఇస్తామన్నారు.

తాడిగడపలో వ్యక్తిపై దాడి

పెనమలూరు: తాడిగడప గ్రామంలో వ్యక్తిపై మరో వ్యక్తి దాడి చేయటంతో పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. టీచర్స్ కాలనీకి చెందిన నందమూరి ప్రసాద్ గ్యాస్ బండల డెలివరీ బాయ్‌గా పని చేస్తాడు. గత కొద్ది రోజుల క్రితం ఇంటి గేటుకు తాళం వేసి ఉండగా కొందరు పిల్లలు గేటు దూకి ఇంటి ఆవరణలోకి వచ్చారు. వచ్చిన పిల్లలను వెళ్లిపోమని ప్రసాద్ చెప్పటంతో వారు వెళ్లారు. కాగా ఈ ఘటన జరిగిన తరువాత మరల ప్రసాద్ ఇంటిపై ఎవరో రాళ్లు వేశారు. ప్రసాద్ ఇంటి నుంచి బయటకు వచ్చి చూడగా ఎదురుగా పలువురు పిల్లలు ఉన్నారు. వారిని ప్రసాద్ ప్రశ్నించగా రాళ్లు ఎవరు వేశారో తమకు తెలియదని చెప్పారు. దీంతో ప్రసాద్ అక్కడ ఉన్న ఒక పిల్లవాడిని మందలించాడు. ఈ ఘటన జరిగిన తరువాత పిల్లవాడిని వెంట పెట్టుకుని సోను అనే వ్యక్తి వచ్చి ఎందుకు కొట్టావని ప్రసాద్ పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ దాడి చేశాడు. ఈ ఘటనపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.

జాబితా విడుదలపై హర్షం

గన్నవరం రూరల్: కృష్ణా జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సంఘం విజ్ఞప్తి మేరకు ఉద్యోగుల సీనియారిటీ జాబితాను విడుదల చేయటంపై ఆ సంస్థ ఉద్యోగుల జిల్లా అధ్యక్షుడు కె.కృపానందం హర్షం వ్యక్తం చేశారు. ఈ నెల 6వ తేదీన జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వి.రవికుమార్‌కు వినతి అందజేయగా తక్షణం స్పందించారని బుధవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

కానూరులో యువకుడిపై దాడి

పెనమలూరు: కానూరులో యువకుడి పై పలువురు దాడి చేయటంతో పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం... కానూరు రామాలయం ప్రాంతానికి చెందిన బురిడి సాయిదుర్గాప్రసాద్ కార్పెంటర్ పని చేస్తాడు. అదే ప్రాంతానికి చెందిన వి.సురేష్, వి.నవీన్‌లతో సాయిదుర్గాప్రసాద్‌కు పాత గొడవలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో సాయిదుర్గాప్రసాద్ పై సురేష్, నవీన్, ఏసు, కిరణ్, వంశీ, నాని, రాంబాబు మరి కొందరు వచ్చి తగాదాపడి దాడి చేశారు.

డ్రైవర్లు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి



డ్రైవర్లకు సూచనలు ఇస్తున్న ఆర్టీఓ, ఎంవీఐ

గన్నవరం: రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా స్థానిక విమానాశ్రయం ఎదురుగా ఉన్న రవాణా శాఖకు చెందిన వాహన పటుత్వ పరీక్ష కేంద్రంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. తొలుత ఈ వైద్య శిబిరాన్ని ఆర్టీవో కె. వెంకటేశ్వరరావు ప్రారంభించారు. అనంతరం విజయవాడకు చెందిన ఆయుష్ హాస్పిటల్, సంధ్య నేత్ర వైద్యశాల ఆధ్వర్యంలో డ్రైవర్లకు గుండె, కంటి వైద్య పరీక్షలను నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆర్టీఓ మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువ శాతం మానవ తప్పిదాల్లో వల్లే జరుగుతున్నాయని చెప్పారు. ఈ ప్రమాదాలను నివారించేందుకు డ్రైవర్లకు రహదారి భద్రతపై నిరంతరం అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. అంతే కాకుండా డ్రైవర్లు ఆరోగ్యంగా ఉండేందుకుగాను వైద్య శిబిరాలను నిర్వహించి సలహాలు, సూచనలు ఇస్తున్నట్లు తెలిపారు. డ్రైవర్లు ఆరోగ్యం బాగుంటేనే వాహనాలను సక్రమంగా నడపగలుగుతారని చెప్పారు. మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు మూర్తి, వై. నాగేశ్వరరావు, శివరామ్‌గౌడ్, ఉదయ్ శివప్రసాద్, డీవీ రమణ, ఎండీ. అలీ, పద్మాకర్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుడికి బడ్డీకొట్టు అందజేత



దివ్యాంగుడు శ్రీనుకు బడ్డీకొట్టు అందజేస్తున్న యలమంచిలి జయప్రకాష్

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడులో నివాసం ఉంటున్న దివ్యాంగుడు బత్తుల శ్రీనుకు ఎనికేపాడులోని వైఎస్ఆర్ చారిటీస్ అధ్యక్షుడు, దాత యలమంచిలి జయప్రకాష్ బుధవారం బడ్డీకొట్టు అందజేశారు. కుటుంబ పోషణ నిమిత్తం ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్న శ్రీను పరిస్థితి తెలుసుకున్న గ్రామ మాజీ ఉపసర్పంచ్ కొల్లా ఆనంద్‌కుమార్ ట్రస్ట్ అధ్యక్షుడు జయప్రకాష్ దృష్టికి తీసుకెళ్లారు. దీనికి స్పందించి స్వయం ఉపాధి నిమిత్తం బడ్డీ కొట్టు అందజేశారు. ఈ సందర్భంగా జయప్రకాష్ మాట్లాడుతూ వైఎస్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదలు, మహిళలు, దివ్యాంగులకు స్వయం ఉపాధి నిమిత్తం తోపుడు బండ్లు, బడ్డీకొట్లు, కుట్టు మిషన్లు, టిఫిన్ బండ్లు అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రతిభ గలిగిన పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు మత్తె రాధాకుమార్, బొల్లు రమారావు, మత్తె కిరణ్‌కుమార్, మార్కండేయులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలి



విద్యానికేతన్ అకాడమీని ప్రారంభిస్తున్న మంత్రి వాసంశెట్టి సుభాష్

పెనమలూరు: విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. గంగూరు చేపల కుండీల వద్ద విద్యానికేతన్ క్యాంపస్‌ను ఆయన బుధవారం ప్రారంభించి ప్రసంగించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి లక్ష్యం చేరుకోవాలని సూచించారు. ఉన్నత విద్యనభ్యసించటం వలన ఉపాధి అవకాశాలు వస్తాయన్నారు. ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని చదువుకోవాలని కోరారు. కార్యక్రమంలో గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తి, టీడీపీ నాయకులు కొనకళ్ల బుల్లయ్య, అనుమోలు ప్రభాకరరావు, ప్రిన్సిపాల్ రాజులపాటి ఆదిశేష పలువురు పాల్గొన్నారు.

అందుబాటులోకి వైద్య సేవలు



వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ సుస్మిత

పెనమలూరు: పోరంకి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం నుంచి వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. గ్రామంలో గత రెండు సంవత్సరాల క్రింద ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రభుత్వం మంజూరు చేసింది. అయితే తూతూ మంత్రంగా సేవలు అందటంతో స్థానికులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి జిల్లా వైద్యాధికారికి ఆదేశాలు జారీ చేశారు. దీంతో పోరంకి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు వైద్యులు అందుబాటులోకి వచ్చి బుధవారం పేదలకు పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందించారు. రోగులకు అన్ని రకాల మందులు కూడా అందుబాటులోకి వచ్చాయి. కాగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సేవలు ప్రజలు ఉపయోగించుకోవాలని అధికారులు తెలిపారు.

విద్యార్థులకు ఎక్సలెన్స్ అవార్డులు ప్రదానం



విద్యార్థులకు అకడమిక్ ఎక్సలెన్స్ అవార్డులను ప్రదానం చేస్తున్న పారిశ్రామిక వేత్త ప్రసాదరాజు

ఉయ్యూరు: విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని రత్న కన్‌స్ట్రక్షన్స్ అధినేత బి.ప్రసాదరాజు అన్నారు. మండలంలోని కలవపాముల జ్యోతి పాలిటెక్నిక్ కళాశాలలో 2024-25 విద్యాసంవత్సరంలో అకడమిక్ ఎక్సలెన్స్ అవార్డుల ప్రదానోత్సవం బుధవారం నిర్వహించారు. 12 మంది ప్రతిభావంతులకు బ్రాంచి టాపర్స్‌కు అవార్డులు, ఒక్కొక్కరికి రూ 5 వేలు నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. అధ్యాపక బృందాన్ని సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ సూరపనేని వెంకటరమణ, ప్రిన్సిపాల్ జన్ను శివకుమార్ పాల్గొన్నారు.

భక్తులకు ప్రసాదాలు పంపిణీ

ఉయ్యూరు: దాతల దాతృత్వం కొనసాగుతుంది. స్వచ్ఛందంగా ప్రసాదాలు, మజ్జిగ, తాగునీటి పంపిణీ చేపడుతూ అమ్మవారి సేవలో తరిస్తున్నారు. మహాలక్ష్మి హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని వీరమ్మతల్లి తిరునాళ్లకు వచ్చిన భక్తజనానికి చక్రపొంగలి, రవ్వకేసరి, పులిహోర పంపిణీ చేశారు. ఏజెన్సీ అధినేత వెంట్రప్రగడ శేషు, మేనేజర్ ఆరేపల్లి నాగరాజు, ఆర్యవైశ్య సంఘ నేత వెంట్రప్రగడ వీరాంజనేయులు పాల్గొన్నారు. మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదం పంపిణీ చేపట్టారు. ఎంపీడీఓ జీఎస్‌వీ శేషగిరిరావు, ఏఓ లోయ శివశంకర్ సిబ్బందితో కలిసి భక్తులకు ప్రసాదాలు అందించి సేవ చేశారు.

పోరంకి రామాలయానికి రూ.7 లక్షలు విరాళం

పెనమలూరు: పోరంకి శ్రీరామాలయానికి భక్తులు బుధవారం రూ.7 లక్షలు విరాళం ఇచ్చారు. గ్రామంలో శ్రీసీతారామలక్ష్మణ ఆంజనేయ సమేత శ్రీ కోదండరామస్వామివారి ఆలయాన్ని పునర్నిర్మాణం చేశారు. నేడు ఆలయంలో స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ ఉంది. ఇందుకుగాను కర్లపూడి సుబ్బారావు, శారదాదేవి రూ.5,01,116 లక్షలు, కర్లపూడి రాహుల్, సత్యమేఘన, పర్ణిష రూ.రూ 1,00,116 లక్షలు, తోటకూర శ్రీనివాసరావు, రమ రూ.1,00,116 లక్షలు ఆలయానికి విరాళం అందచేశారు.